క్లుప్తంగా

స్కేటింగ్‌లో విద్యార్థి ప్రతిభ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప మాట్లాడుతూ ఈ నెల 5,6 తేదీల్లో గుంటూరు జిల్లా 20వ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్, ఆర్ఎస్ఏజీ ఆధ్వర్యాన గుంటూరులో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి జి.సాయి నవనీత్ గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించాడని తెలిపారు. ఈ నెల 25, 26 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో సాయి నవనీత్ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మెల్లెంపూడి రవి, నూతక్కి రవి, ఉపాధ్యాయులు, ప్రజలు అభినందించారు.

కోర్టు తీర్పులను అమలుచేయాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు స్టీవెన్, పిచ్చయ్య, సుభాని, సాంబశివరావు, నాగేశ్వరరావులతో కలసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు గత 308 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని ఇప్పటికైనా కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై, ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, దుర్గాభవాని, శివకుమారి, గురవయ్య, ఆశీర్వాదం, శారమ్మ, రమాదేవి, రిబ్కా, సువర్ణకుమారి, కాసమ్మ, అంకయ్య, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ఎంఈఓ కెన్నడీ



కాకుమాను: నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు క్రీడలు ఎంతో ప్రాముఖ్యమైనవని ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్. కెన్నడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.జీ.ఎఫ్. ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కెన్నడీ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలలో రాణించాలని ఆయన సూచించారు. ప్రముఖ క్రీడాకారులను స్మరించుకుంటూ వారిని ఆదర్శంగా తీసుకుని క్రీడలలో రాణించాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలును నిర్వహించారు. మండలంలోని కొమ్మూరు, బోడిపాలెం, కొండపాటూరు, రేటూరు, గరికపాడు, ఏ.పీ.ఎస్. డబ్ల్యూ ఆయా పాఠశాలలోని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం జీ.వీ.బి. వెంకట్రావు, ఉపాధ్యాయులు,విద్యార్థులుపాల్గొన్నారు.

10న సర్వసభ్య సమావేశం

దుగ్గిరాల: మండల సమావేశం మందిరంలో ఈ నెల 10వ తేదీ సర్వసభ్య సమావేశం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం జరుగుతుందని మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియాజకవర్గ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని కోరారు.

భూ సమీకరణపై 'కూటమి' స్పష్టత ఇవ్వాలి

తాడికొండ: అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం తలపెట్టిన రెండో విడత భూ సమీకరణపై 'కూటమి' స్పష్టత ఇవ్వాలని ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు కోరారు. రాజధాని పేదలకు న్యాయం చేయాలని కోరుతూ నిడుముక్కలలో జంజనం కోటేశ్వరరావు చేస్తున్న దీక్ష మంగళవారానికి 100వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన చండీహోమం నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన వెంట పలువురు రైతులు, మహిళలు, ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు మడుగులు.. అడుగులు వేసేదెలా!

- మంగళగిరి, తాడేపల్లి పరిధిలో ముంగిటే ముప్పు
- దోమల బాధ
- దుర్వాసన
- స్థానికులకు తిప్పలు



దోలాస్‌నగర్ వద్ద రోడ్డుపై మురుగు నీరు

తాడేపల్లి రూరల్: మంగళగిరి, తాడేపల్లి పరిధిలోని పలు రోడ్లలో మురుగు మడుగులు తారసపడుతున్నాయి. వీటిలో అడుగు తీసి అడుగు వేయాలంటే అవస్థలే. మురుగు దుర్వాసనతో పాటు పాచి ఉండటంతో జారి పడతామేమో అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మంగళగిరిలో బహుళ అంతస్తుల నుంచి వచ్చే వాడుక నీరు, ఇతర మురుగు నీరు వెళ్లే దారి లేక ఇళ్ల ముంగిటే నిలిచిపోతోంది. లక్షలాది రూపాయలతో సొంత గూడు ఏర్పరచుకుంటే వారిని మురుగు తిప్పలు వెంటాడుతున్నాయి. మురుగు నీటిలో నుంచి వెళ్లాల్సి వస్తోంది.. వానొస్తే ఇక పరిస్థితి చెప్పక్కర్లేదని పలువురు వాపోతున్నారు. మరోవైపు తాడేపల్లితో పాటు మంగళగిరి పట్టణ, రూరల్ పరిధిలో బతుకు తెరువు కోసం వివిధ ప్రాంతాలనుంచి వలస వచ్చిన వారు సుమారు 30, 40 సంవత్సరాల క్రితం కొండ పోరంబోకు, అసైన్‌మెంట్ భూములు, ఇతర భూముల్లో పక్కా నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో కూడా మురుగు నీరు పోయే దారి లేదు.

తాడేపల్లి పరిధిలోని..

ప్రకాష్‌నగర్, డోలాస్‌నగర్, నులకపేటతో సుమారు 10 వేల మందికిపైె జనాభా నివసిస్తున్నారు. 5 వేల మందికిపైగా ఓటర్లు ఉన్నారు. ఈ ప్రాంతంలో నిత్యం జనాభా పెద్ద సంఖ్యలో తిరుగుతుంటారు. ఈ ప్రాంతాల్లోనూ డ్రెయినేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మంగళగిరి మున్సిపాలిటీగా ఉన్నప్పుడు తాడేపల్లి, కృష్ణనగర్ పంచాయతీగా ఉన్న సమయంలోను, ఆ తరువాత మున్సిపాలిటీగా ఏర్పడిన తరువాత కూడా అధికారులు సరైన ప్రణాళిక రూపొందించ లేదనే విమర్శలు వస్తున్నాయి. రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రాంతం కార్పొరేషన్ పరిధిలోకి వచ్చినా ప్రజలకు మురుగు ముప్పు తప్పడం లేదు. అధికారులు విద్యుత్ మోటార్ల ద్వారా మురుగునీటిని ఎత్తిపోసినా వర్షం పడితే చాలు పలు ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపై నిలుస్తోంది.

ఆక్రమణలపై చర్యలు సున్నా

మరోవైపు రాజకీయ నాయకుల ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించకపోవడం, కాలువలు ఆక్రమించుకుని భారీ కట్టడాలు నిర్మించినా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో కాలువల్లో చెత్తాచెదారం పేరుకపోయి మురుగు ముందుకు కదలని పరిస్థితి ఎదురవుతోంది.

చెండుకుతింటున్న దోమలు

సాయంత్రమైతే బహిరంగ ప్రదేశాల్లో దోమలు చేరి ప్రజలను పీక్కు తింటున్నాయని, నివాసాల్లో అయితే చెప్పాల్సిన అవసరం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థపై కార్పొరేషన్ అధికారులు ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. లోతట్టు ప్రాంతాల్లో కూడా మురుగునీటిని బయటకు పంపడానికి ప్లాన్లు రూపొందించాలని, ప్రధానంగా మంగళగిరి, ప్రకాశం బ్యారేజ్ రోడ్డు వెంట లోతట్టు ప్రాంతాల్లో డ్రైన్లు ఏర్పాట్లు చేస్తే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదని అధికారులే మాట్లాడుతుండటం గమనార్హం.

పని గంటల పెంపును ఉపసంహరించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

తాడేపల్లి రూరల్: పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలని కోరుతూ మంగళవారం తాడేపల్లి రూరల్‌లోని ఉండవల్లిలో సీఐటీయూ ఆధ్వర్యాన కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో కార్పొరేట్ల మెప్పుకోసం పని గంటలుపెంచి రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు తీరని ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఫ్యాక్టరీల చట్టం 1948కి ప్రభుత్వం చేసిన సవరణలు కార్మికులను బానిసలుగా మారుస్తాయని, దీన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మేడే స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పని గంటలను కార్మిక వర్గం అంతా సంఘటితమై అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రతా చర్యలు



నగరంపాలెం: తుళ్లూరు, ఉత్తర సబ్ డివిజన్ల పరిధిలో భద్రత పరంగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలోని హాల్‌లో మంగళవారం తుళ్లూరు, ఉత్తర పోలీస్ సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత తుళ్లూరు, ఉత్తర డీఎస్పీలు సబ్ డివిజన్లలోని పోలీస్‌స్టేషన్లు, శాంతి భద్రతలకు సంబంధించిన విషయాలు, నేరాలు, కేసుల వివరాలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వీవీఐపీ, వీఐపీలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాలు ఉన్నాయని, భద్రత ప్రమాణాలను మెరుగుపరచాలని ఎస్పీ ఆదేశించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కార్యకలాపాలను నిరోధించేలా ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయం, హైకోర్టుకు వెళ్లే జడ్జిలు, వీవీఐపీ, వీఐపీల రాకపోకల వేళల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు మురళీకృష్ణ (తుళ్ళూరు), మురళీకృష్ణ (ఉత్తర సబ్ డివిజన్), సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన మందు పంపిణీ



ఎలుకల నిర్మూలన మందును రైతులకు అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటంలో రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలన మందును మంగళవారం రైతులకు వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి పి.శిరీష మాట్లాడుతూ రైతులకు వరి సాగులో ఎలుకలతో కలిగే నష్టాన్ని వివరించారు. ఎలుకలను ఎలా నివారించాలో సూచించారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన ఎలుకల నిర్మూలనకు బ్రోమోడిలైన్ మందును ఉచితంగా అందజేస్తోందని పేర్కొన్నారు. ఈ మందును ఎకరానికి నూకలు 1.96 కేజీ, శనగ నూనె 2 గ్రాములు, గ్రోమోడ్‌లైన్ మందు 2 గ్రాములు కలుపుకొని వాటిని న్యూస్ పేపర్‌లో ఒక 10 గ్రాముల చొప్పు 20 పొట్లాలు కట్టి వాటిని వరి పొలంలో బొరియలు ఉన్న చోట ఎలా ఏర్పాటు చేయాలో చేసి చూపించారు. రైతులు అందరూ ఒకే రోజు ఈ మందును ఉపయోగిస్తే ఫలితం ఎక్కువగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు కొండలరావు, వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్‌బాబు, వి.ఎ.ఎ. వంశీ, రైతులు, ఇప్పటం గ్రామ అధ్యక్షులు రత్తయ్య, శ్రీశైలం శ్రీమల్లికార్జున దేవస్థానం బోర్డు డైరెక్టర్ శంకర్‌శెట్టి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: మండలంలోని రైతులకు 8వేల హెక్టార్లలో ఎలుకల నివారణకు ప్రభుత్వం పూర్తి ఉచితంగా మందు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ ఆర్.విజయబాబు తెలిపారు. మంగళవారం దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో రైతుసేవా కేంద్రాల ద్వారా ఉచిత ఎలుకల మందును రైతులకు వ్యవసాయ అధికారి, తహసీల్దారు ఐ.సునీత అందించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో ప్రాంతీయ భాషలకు ప్రోత్సాహం



మోతడక(తాడికొండ): సాంకేతిక విద్యలో భారతీయ భాషలను ప్రోత్సహించడానికి ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వాణి పథకంను ప్రారంభించిందని చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫ్యూచర్ స్మార్ట్ సిటీ– ఇంటిలిజెంట్ మోబిలిటీ అనే అంశంపై ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సెమినార్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యలో భారతీయ భాషల వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రాంతీయ భాషలలో జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం దీని ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ పథకం కింద ఏఐసీటీఈ ఆమోదిత సంస్థలు ప్రాంతీయ భాషల్లో సెమినార్లు, సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. అనంతరం విద్యాసంస్థల కార్యదర్శి వై.సుజిత్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావుతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ వీవీ సుబ్బారావు, డాక్టర్ పి.బాలమురళీకృష్ణ, డాక్టర్ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జర్మన్ భాషలో శిక్షణ ఇవ్వడం ఆనందంగా ఉంది


జర్మనీ ప్రతినిధులు



జర్మనీ ప్రతినిధులను సత్కరిస్తున్న వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథివర్మ తదితరులు

తాడేపల్లి రూరల్: కేఎల్‌యూ విద్యార్థులకు జర్మన్ భాషలో శిక్షణ ఇవ్వడం ఆశ్చర్యంతో పాటు ఆనందంగా ఉందని జర్మనీ ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీని చెన్నైలోని జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, హైదరాబాద్‌లోని జర్మనీ కాన్సుల్ అమిత్ దేశాయ్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలోని వివిధ రకాల ఆచార్యులను, పరిశోధకులను కలసి విద్యాపరిశోధన సహకారాల అవకాశంపై చర్చించారు. వారు జర్మన్ భాషలో ప్రసంగం కొనసాగించారు. అనంతరం జర్మనీ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎస్.వెంకట్రామ్, అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ విజయ్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఈ-బైక్ డిజైన్ పోటీల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: రవాణా రంగంలో విద్యుత్ వాహనాలకు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రికల్ బైక్‌కు జాతీయస్థాయిలో అవార్డులతో పాటు, నగదు బహుమతులను సాధించటం సంతోషకరమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులోని శ్రీరామకృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెక్ట్రాన్ మోటర్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నేషనల్ లెవల్ ఈ-బైక్ డిజైన్ ఛాలెంజ్ (సీజన్ 5.0) 2025 పోటీల్లో దేశంలోని వివిధ కళాశాలల నుంచి అనేక విద్యార్థుల బృందాలు పాల్గొనగా, తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఈ-బైక్ ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ అవార్డు (రూ.10,000 నగదు బహుమతి) గెలుచుకున్నారు. అదేవిధంగా బెస్ట్ హోల్ క్లింబ్ (6.1 స్పీడ్) అవార్డు (రూ.5,000 నగదు బహుమతి), బెస్ట్ బంప్ టెస్ట్ అవార్డు (రూ.5,000 నగదు బహుమతి), బెస్ట్ రన్నర్ డ్రాగ్ రేస్ అవార్డు, బెస్ట్ రన్నర్ ఆటో క్రాస్ వంటి నాలుగు ప్రత్యేక విభాగాల్లో కూడా ప్రత్యేక అవార్డులను గెలుచుకున్నారన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు భవిష్యత్తులో రవాణా రంగం అంతా విద్యుత్ వాహనాల వినియోగ దిశగా మార్పు జరగనున్నదని, పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు అభినందించారు.

విద్యార్థులకు మంచి అలవాట్లు నేర్పించండి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: విద్యార్థి దశ నుంచే పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. ఆశాడే వేడుకలను సాలిపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. అలా చేయకపోతే నోటి ద్వారా బ్యాక్టీరియా శరీరంలోకి వెళ్లి వాంతులు, విరేచనాలు, డయేరియా వంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్యాధికారి డాక్టర్ బీవీ కిషోర్ మాట్లాడుతూ గర్భ నిర్ధారణ కిట్‌లను అందుబాటులో ఉంచుకుని అవసరమైన వారికి పరీక్షలు చేయాలని సూచించారు. అనంతరం కొత్తపేటలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర హాస్టల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు దేవరపల్లి సుభాష్ రమాదేవి, వేముల ప్రియాంక, హాస్టర్ ప్రిన్సిపాల్ ఈరుగంటి నిరీక్షణరావు, మలేరియా అధికారులు చిరసాని ప్రభాకర్‌రెడ్డి, శ్రీకంఠ ఉమాకాంత్, అందె బాలచంద్రమౌళి, జి.రవికుమార్, డీపీఎంఓ జంగం శ్యామ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టాలి



ఐద్వా పతాక ఆవిష్కరణలో మహిళా నాయకులు

తాడేపల్లి రూరల్: మద్యం, మత్తు పదార్థాల విక్రయాలను రాష్ట్ర ప్రభుత్వ అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్‌లో ఐద్వా తాడేపల్లి పట్టణ 6వ మహాసభను కార్యదర్శి గిరిజ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సంఘ పతాకాన్ని బాలబొమ్మలు ఆవిష్కరించారు. అనంతరం మహిళా ఉద్యమ మణిపూస మానికొండ సూర్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస కుమారి మాట్లాడుతూ మతోన్మాదం, ప్రైవేటీకరణ విధానాలతో మహిళలకు భద్రత కరువైందన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న హింస, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో కుటుంబాలు ఛిద్రమౌతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం, మత్తు పదార్థాలతో దేశానికి ఉపయోగపడాల్సిన యువశక్తి నిర్వీర్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలని, ఇళ్ల పట్టాల కార్యక్రమం వేగవంతం చేయాలని, ఇల్లులేని పేదలకు రెండు సెంట్ల స్థలంఇవ్వాలని, రేషన్ షాపును ఏర్పాటు చేయాలని, మహిళలపై దాడులు, అకృత్యాలను అరికట్టాలని, డ్వాక్రాలో జరుగుతున్న అవినీతిని నిర్మూలించాలని కమిటీ తీర్మానించింది. కార్యక్రమంలో ఐద్వా నాయకులు, కీర్తన, జ్యోతి, భ్రమరాంబ, ఉష తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం ఆదర్శం



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నేతలు

మంగళగిరి టౌన్: మహర్షి వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు అన్నారు. మంగళగిరి పరిధిలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేశన మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలన్నారు. వారి మార్గంలో పయనించి అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధించవచ్చు అనడానికి వాల్మీకి జీవితం నిదర్శనమని కొనియాడారు. రామాయణం రచించిన ఆదికవిగా, బందిపోటు నుంచి మహర్షిగా మారడం వాల్మీకి గొప్పతనం అని పేర్కొన్నారు. ఆయన చూపిన సత్యం, ధర్మం, నీతి మార్గాల్లో నడుచుకుంటూ సమాజానికి సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు క్రాంతికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరామ్ బాబాజీ, రాష్ట్ర యువజన అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నాయకులు కిరణ్, శివ, సైదా తదితరులు పాల్గొన్నారు.

'ఆశ'ల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు



నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

ఫిరంగిపురం: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ వద్ద ఆశ డే సందర్భంగా మంగళవారం ఆశ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని చెప్పారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైద్యురాలికి వినతి పత్రం అందజేశారు.

దుగ్గిరాల: ఈమని పీహెచ్‌సీలో ఆశ డే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యాన సీహెచ్ఓ సునీతకు వినతి పత్రం అందజేశారు. వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని, టీఏ, డీఏలు ఇవ్వాలని, నాణ్యమైన యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనాభాకనుగుణంగా ఆశ కార్యకర్తలను నియమించాలన్నారు. జయ, మాధవి, రేఖ, తిరుమల దేవి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో..

తాడేపల్లి రూరల్: ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొప్పనాతి లక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని డ్రైవర్స్‌కాలనీ యూపీహెచ్‌సీ వద్ద ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు వృత్తిలో మరింతగా రాణించడానికి 5జీ మొబైల్ ఫోన్ ఇవ్వాలని, నాణ్యమైన యూనిఫామ్ అందజేయాలని కోరుతున్నామన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పనిని 13 గంటలకు పెంచడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం కార్మికులపై నిర్లక్ష్య భావంతో ఉందని విమర్శించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆస్పత్రి ప్రధాన వైద్యులకు అందజేశారు. కార్యక్రమంలో వేముల రేణుక, సీహెచ్ సుగుణ, విజయశ్రీ, విజయలక్ష్మి, జయలక్ష్మి, కెన్నా జ్యోతి, కరుణ కుమారి, బేబి తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు: ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ మండల సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం వద్ద ధర్నా జరిగింది. అనంతరం పలు రకాల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి సిద్ధిక్‌కు అందజేశారు. అనంతరం నేతలు బొట్ల రామకృష్ణ, మండల ఆశ వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయం



నిరసన కార్యక్రమంలో నాయకులు

మంగళగిరి టౌన్: సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి హేయమైనదని ఎస్సీ ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్, పలువురు వామపక్ష నేతలు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నేతలు మాట్లాడుతూ ఈ దాడితో భారత్ అందోళనకు గురైందన్నారు. ఇది భారత రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. కుల, మత అహంకారంతో ఘటన ముడిపడి ఉందని, ప్రపంచ వ్యాప్తంగా భారతదేశంలో జరుగుతున్న అక్రమాలు ఎక్కడా లేవన్నారు. దేశంలో మత కల్లోలాలు సృష్టించే వ్యవస్థ బయలుదేరిందని, రాబోయే రోజుల్లో మతోన్మాదులకు బుద్ధి చెప్పాల్సిన ఆవశ్యకత ఉందని, దీనిపై గురువారం మరో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ సెక్రటరి డేవిడ్, సీపీఐ నాయకులు అన్నవరపు ప్రభాకర్, కంచర్ల కాశయ్య, చిన్ని తిరుపతయ్య, నందం బ్రహ్మేశ్వరరావు, సీపీఎం నాయకులు జవహర్‌లాల్, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.